సొరేన్ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, మే 10: మనీ లాండరింగ్ కేసులో తన కేసు విచారణకు సంబంధించి జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఈడీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ జార్ఖండ్ హైకోర్టులో తాను వేసిన పిటిషన్‌ను త్వరగా విచారించేలా ఆదేశాలు జారీ చేయాలన్న ఆయన అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం తిరస్కరించింది. ఈడీ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ సొరేన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఈ నెల 3న తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, ఈ పిటిషన్ వృథా అని కోర్టు తెలిపింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ వచ్చే వారం విచారిస్తామని పేర్కొన్నది.

గంగోత్రి ధామ్‌లో పూజల నిర్వహణ

చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

డెహ్రాడూన్: చార్‌ధామ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాలు భక్తుల కోసం తిరిగి తెరుచుకున్నాయి. చలికాలం మూసివేసిన గర్వాల్ హిమాలయాల్లోని ఈ దేవాలయాలను అక్షయ తృతీయ సందర్భంగా తిరిగి తెరిచారు. భక్తులను శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి అనుమతించారు. భక్తులు 'హరహర మహాదేవ', 'జై మా యమున' అంటూ నినాదాలు చేశారు. భారత సైన్యంలోని గ్రెనేడియర్ రెజిమెంట్ బ్యాండ్ భక్తి గీతాలను ఆలపించింది. ఈ దేవాలయాన్ని 20 క్వింటాళ్ల పూలతో అలంకరించారు. హెలికాప్టర్ నుంచి పూలను భక్తులపైకి జల్లారు.

మరో 75 ఏఐ ఎక్స్‌ప్రెస్ విమానాలు రద్దు

ముంబై: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ క్యాబిన్ క్రూ కొరత వల్ల శుక్రవారం 75 విమానాలను రద్దు చేసింది. ఆదివారం నాటికి వైమానిక సేవలు సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉన్నట్లు ఆ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. క్యాబిన్ సిబ్బందిలో కొందరు సమ్మెను గురువారం విరమించినట్లు తెలిపారు. విమానాల రద్దు, ప్రయాణికులకు నష్టపరిహారం కారణంగా సంస్థకు రూ.30 కోట్ల మేరకు ఆదాయ నష్టం వచ్చిందని చెప్పారు.

దభోల్కర్ హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

పుణె: హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసులో దాదాపు పదకొండేండ్ల తర్వాత పుణె కోర్టు తీర్పు చెప్పింది. సెషన్స్ జడ్జి పీపీ జాదవ్ శుక్రవారం తీర్పు చెప్తూ, సచిన్ అందురే, శరద్ కలస్కర్‌లకు జీవిత ఖైదు, రూ.5 లక్షలు జరిమానా విధించారు. డాక్టర్ వీరేంద్ర సింగ్ తవడే, విక్రమ్ భవే, సంజీవ్ పునలేకర్ నిర్దోషులని తెలిపారు. నిర్దోషులుగా నిర్ధారణ అయిన ముగ్గురూ ప్రస్తుతం జైలులో ఉన్నారు. వీరికి సంజీవ్ న్యాయవాదిగా పని చేశారు. అయితే సాక్ష్యాధారాలను అదృశ్యం చేశారని ఆరోపిస్తూ ఆయనను అరెస్ట్ చేశారు. దభోల్కర్ వృత్తి రీత్యా వైద్యుడు. ఆయన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసేవారు. దీంతో ఆయనను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించారు. ఆయనను చంపుతామని చాలా మంది బెదిరించేవారు.

పెండ్లి వాయిదా పడిందని తల నరికాడు

కర్ణాటకలో బాలికపై యువకుడి దురాగతం

మడికెరి, మే 10: పెండ్లి వాయిదా పడిందనే కోపంతో ఓ యువకుడు 16 ఏండ్ల బాలికను కత్తితో తల నరికి దారుణంగా హత్య చేశాడు. కర్ణాటకలోని సుర్లబ్బి గ్రామంలో గురువారం ఈ అమానుషం చోటు చేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశ్(32)కు, ఇటీవలే పదో తరగతి ఉత్తీర్ణురాలైన బాలికకు పెండ్లి చేయాలనుకున్నారు. అయితే అధికారులు రెండు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో బాలిక ఇంటికి వచ్చిన ప్రకాశ్ కోపంతో ఊగిపోతూ బాలిక తల్లిని గాయపరిచి.. బాలికను బయటకు ఈడ్చుకొచ్చి ఆమె తల నరికి.. తలతో పాటు పరారయ్యాడు.

ఉప్పు ఎక్కువ తింటే క్యాన్సర్ ముప్పు

వియెన్నా యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

లండన్, మే 10: ఉప్పు ఎక్కువ తినే వారికి చేదు వార్త చెప్పారు వియెన్నా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. ఉప్పు పొదుపుగా వాడే వారితో పోలిస్తే ఉప్పు ఎక్కువగా తినే వారిలో కడుపు క్యాన్సర్ ముప్పు 41 శాతం అధికంగా ఉంటుందని వీరు గుర్తించారు. అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) సూచనల ప్రకారం రోజుకు ఒక మనిషి 2,300 ఎంజీ సోడియం కంటే ఎక్కువ తీసుకోవద్దని, ఇది ఒక్క టేబుల్‌స్పూన్ ఉప్పుతో సమానమని, అయితే, అమెరికన్లు సగటున రోజుకు 3,400 ఎంజీ సోడియం తీసుకుంటున్నారని చెప్పారు.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్

- జూన్ 1 వరకు మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- లోక్‌సభ ఎన్నికల వేళ ఢిల్లీ సీఎంకు భారీ ఊరట
- 50 రోజుల తర్వాత జైలు నుంచి బయటకు
- సీఎం ఆఫీసుకు వెళ్లొద్దని, ఫైళ్లపై సంతకం చేయొద్దని కేజ్రీవాల్‌కు షరతులు విధింపు

బెయిల్‌పై బయటికి వచ్చాక ఆప్ శ్రేణులకు కేజ్రీవాల్ అభివాదం

న్యూఢిల్లీ, మే 10: ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన 50 రోజుల తర్వాత శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వీలుగా జూన్ 1వ తేదీ వరకు 21 రోజుల పాటు ఆయనకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం మధ్యంతర బెయిల్ ఇచ్చింది. జూన్ 2న కేజ్రీవాల్ తిరిగి లొంగిపోవాలని ఆదేశించింది. జూన్ 5 వరకు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తిరస్కరించింది. మధ్యంతర బెయిల్ నేపథ్యంలో కేజ్రీవాల్‌కు ధర్మాసనం షరతులు విధించింది. ఢిల్లీ సచివాలయం, సీఎం కార్యాలయానికి వెళ్లొద్దని ఆదేశించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం పొందాల్సిన తప్పనిసరి ఫైళ్లు తప్ప ఎలాంటి అధికారిక ఫైళ్లపై సంతకం చేయొద్దని పేర్కొన్నది. కేసుకు సంబంధించి తన పాత్ర గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, సాక్షులను కలవొద్దని, కేసుకు సంబంధించిన అధికారిక ఫైళ్లను చూడొద్దని ఆదేశించింది.

ఈడీ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని, ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ మంజూరు చేసిన దాఖలాలు గతంలో లేవని ఈడీ తరఫు న్యాయవాదులు చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసులో 2022 ఆగస్టులో ఈడీ దర్యాప్తు ప్రారంభించి, ఈ ఏడాది మార్చి 21న అరెస్టు చేసిందని, అంటే, ఏడాదిన్నర పాటు కేజ్రీవాల్ బయటే ఉన్నారని కోర్టు పేర్కొన్నది. 21 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వడం వల్ల తేడా ఏమీ ఉండదని పేర్కొన్నది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడం ద్వారా దేశంలో సాధారణ ప్రజలతో పోలిస్తే రాజకీయ నేతలు ప్రయోజనం పొందే స్థితిలో ఉంటారని చెప్పినట్టు అవుతుందని ఈడీ తరఫు న్యాయవాది చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. కేజ్రీవాల్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయనే విషయంలో సందేహం లేదని, అయితే అవి నిరూపితం కాలేదని పేర్కొన్నది. ఆయనకు నేరపూరిత చరిత్ర లేదని, సమాజానికి ఆయన ముప్పు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ఆయన అరెస్టులో చట్టబద్ధత, చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

నియంతృత్వం నుంచి దేశాన్ని కాపాడుకుందాం: కేజ్రీవాల్

తీహార్ జైలు నుంచి శుక్రవారం సాయంత్రం విడుదలైన కేజ్రీవాల్‌కు ఆప్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ... 'నియంతృత్వానికి వ్యతిరేకంగా నా శక్తిమేర పోరాడుతున్నాను. 140 కోట్ల దేశ ప్రజలు సైతం కలిసికట్టుగా పోరాడాలి. కోట్లాది మంది దేశ ప్రజలు నాకు ఆశీర్వాదాలు పంపించారు. వారందరికీ, సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు.' అని పేర్కొన్నారు.

ఇది ప్రజాస్వామ్య విజయం: సునీత

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు కావడం పట్ల ఆయన సతీమణి సునీత సంతోషం వ్యక్తం చేశారు. 'ఇది ప్రజాస్వామ్య విజయం. లక్షలాది మంది ప్రజల ఆశీస్సులు, ప్రార్థనల ఫలితం. అందరికీ ధన్యవాదాలు' అని ఆమె ట్వీట్ చేశారు. కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడం పట్ల పశ్చిమ బెంగాల్ సీఎం మమత సంతోషం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ స్వాగతించారు. దేశంలోని నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా కేజ్రీవాల్‌కు న్యాయం, ఉపశమనం లభించడం మార్పు పవనాలకు భారీ సంకేతమని శివసేన(యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే పేర్కొన్నారు.

'బ్రిజ్‌పై అభియోగాలు నమోదు చేయండి'

న్యూఢిల్లీ, మే 10: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా అవసరమైన ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ కోర్టు పేర్కొన్నది. లైంగిక వేధింపులు, ఇతర ఆరోపణల్లో ఆయనపై అభియోగాల నమోదుకు ఆదేశాలు జారీ చేసింది. ఐపీసీ సెక్షన్ 354, 354ఏ, 506 కింద అభియోగాలు నమోదు చేయాలని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్ ఆదేశించారు. ఈనెల 21న కోర్టు బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలను నమోదు చేయనున్నది. ఈ కేసులో గత ఏడాది జూన్ 15న ఢిల్లీ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పై కూడా అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. బ్రిజ్‌పై ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల్లో ఒకరి ఫిర్యాదులో ఆధారాలు లేనందున అతడిని డిశ్చార్జ్ చేసింది.

పోక్సో కేసు మూసివేతపై 20న తీర్పు

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి, తర్వాత వెనక్కు తీసుకున్న మైనర్ రెజ్లర్ కేసును మూసివేసేందుకు పోలీసులు కోరిన అనుమతిపై మే 20న మరో ఢిల్లీ కోర్టు తీర్పు వెలువరించే అవకాశం ఉంది. మైనర్ రెజ్లర్ ఫిర్యాదుతో బ్రిజ్ భూషణ్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే, అనూహ్యంగా తాను అబద్ధపు ఆరోపణలు చేశానని ఆమె తండ్రి ప్రకటించిన సంగతి తెలిసిందే.

గవర్నర్ లైంగిక వేధింపులపై రాష్ట్రపతిని ఆశ్రయిస్తా

బెంగాల్ రాజ్‌భవన్ ఉద్యోగిని వెల్లడి

కోల్‌కతా, మే 10: తనపై పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఆరోపించిన రాజ్‌భవన్ ఉద్యోగిని.. న్యాయం కోసం రాష్ట్రపతి ముర్ము జోక్యాన్ని కోరుతానని శుక్రవారం వెల్లడించారు. రాజ్యాంగపరంగా రక్షణ ఉన్న గవర్నర్‌పై దర్యాప్తులో పోలీసులు ముందుకు వెళ్లలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని అన్నారు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి గవర్నర్ రాజ్‌భవన్‌లో ఎడిట్ కాని సీసీ ఫుటేజ్‌లను కొందరికి ప్రదర్శించి చూపారని, అందులో బాధితురాలినైన తన ముఖాన్ని బ్లర్ చేయకుండానే ఫుటేజ్‌ను ప్రదర్శించారని ఆరోపించారు. ఇది తనను అవమానించడం, గౌరవానికి భంగం కలిగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని సంప్రదిస్తారా? అని అడుగగా, తన ఉదంతంపై మోదీకి సమాచారం వెళ్లిందనే భావిస్తున్నానని, అయితే ఎలాంటి స్పందన లేదని, దీని గురించి ఆయనకు విజ్ఞప్తి చేయడం వృథా అని అన్నారు.

ప్రజ్వల్ కేసులో మలుపు

బెదిరించి ఫిర్యాదు చేయించారన్న బాధితురాలు

బెంగళూరు, మే 10: జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్‌పై నమోదైన సెక్స్ స్కాండల్ కేసు కొత్త మలుపు తీసుకొంది. కొందరు తనను వేధించి బలవంతంగా తనతో ప్రజ్వల్‌పై తప్పుడు ఫిర్యాదు చేయించారని ఓ మహిళ తమకు తెలిపిందని జాతీయ మహిళా కమిషన్ గురువారం వెల్లడించింది. దీనిపై జేడీఎస్ కర్ణాటక యూనిట్ అధ్యక్షుడు కుమారస్వామి స్పందిస్తూ....బాధిత మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వాంగ్మూలాలు ఇవ్వకపోతే, వ్యభిచారం కేసులు నమోదు చేస్తామని వారిని సిట్ బెదిరిస్తున్నదని ఆరోపించారు. దర్యాప్తు ఇలాగేనా చేసేది అని ఆయన సిట్‌ను ప్రశ్నించారు. 'కిడ్నాప్‌కు గురైన మహిళను కోర్టు ముందు ఎందుకు హాజరు పరచలేదు' అని ఆయన ప్రశ్నించారు. కుమారస్వామి వ్యాఖ్యలపై రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర స్పందించారు. 'వాళ్లు కావాలనుకొంటే సిట్ మీద ఫిర్యాదు చేయవచ్చు' అని తెలిపారు.

పోలింగ్ శాతంపై ఖర్గే ఆరోపణలు నిరాధారం: ఈసీ

న్యూఢిల్లీ, మే 10: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతాల ప్రకటనపై విపక్ష పార్టీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాసిన లేఖపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన ఆరోపణలు నిరాధారమైనవని, అవాంఛనీయమైనవని శుక్రవారం పేర్కొన్నది. ఎన్నికల వేళ ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో, పార్టీల్లో గందరగోళం వ్యాప్తి చేసే ప్రయత్నమని స్పష్టం చేసింది. మొదటి రెండు దశల పోలింగ్ శాతాల విడుదలలో ఎలాంటి లోపాలు, జాప్యం జరగలేదని పేర్కొంటూ ఈసీ ఐదు పేజీలతో స్పందనను విడుదల చేసింది. ఖర్గే తన అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకోవచ్చని, అయితే లేఖను బహిరంగపరచడం ఆయన ఉద్దేశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఈసీ పేర్కొన్నది. ఇటువంటి చర్యలు ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆటంకమని, ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. మరోవైపు పోలింగ్ శాతాల ప్రకటనలో జాప్యం, మోదీ, అమిత్‌షా సహా ఇతర బీజేపీ నేతల కోడ్ ఉల్లంఘనలపై ఇండియా కూటమి నేతలు ఈసీ అధికారులను కలిశారు.

48 గంటల్లో పోలింగ్ వివరాలు తెలపాలి!

సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్

న్యూఢిల్లీ, మే 10: పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా కచ్చితమైన పోలింగ్ శాతం వివరాలను ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఆదేశించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో తారుమారు చేసే పద్ధతులు ఉండకూడదని అభిప్రాయపడింది. వాస్తవానికి, ఎన్నికల సంఘం పోలింగ్ రోజే సాయంత్రం 7 గంటలకు ఆ రోజు నమోదైన పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తుంది. కచ్చితమైన పోలింగ్ శాతాన్ని చాలా రోజుల సమయం తర్వాత విడుదల చేస్తున్నది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలనే తీసుకొంటే.. ఏప్రిల్ 19న తొలి దశ ఎన్నికలు పూర్తవ్వగా, ఆ రోజు సాయంత్రం ప్రాథమికంగా పోలింగ్ శాతాన్ని వెల్లడించింది. ఆ తర్వాత 11 రోజులకు అంటే.. ఏప్రిల్ 30న తుది పోలింగ్ శాతాన్ని తెలిపింది. ఏప్రిల్ 19న చెప్పిన శాతం కంటే.. 30న చెప్పినది 5-6 శాతం ఎక్కువ ఉండటం గమనార్హం.

పాక్‌ను గౌరవించాలి!

- లేకుంటే అణుబాంబులు వేస్తారు
- మనమే మూల్యం చెల్లించుకోవాలి
- కాబట్టి ఆ దేశంతో చర్చలు జరపాలి
- అంతేగానీ సైన్యంతో రెచ్చగొట్టొద్దు
- కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్

మణిశంకర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల సమయంలో రోజుకో కాంగ్రెస్ సీనియర్ చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు ఆ పార్టీకి కొత్త తలనొప్పులు తీసుకొస్తున్నాయి. మొన్నటికి మొన్న 'వారసత్వ పన్ను', 'దక్షిణాది వాళ్లు ఆఫ్రికన్లుగా ఉంటారం'టూ కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపగా, నిన్న 'దేశంలో నీగ్రోలు ఉన్నారం'టూ మరో కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి మరో వివాదానికి తెరతీశారు. తాజాగా మరో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ భారత్-పాక్ సంబంధాలపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

మణిశంకర్ అయ్యర్ ఏమన్నారంటే?

'పాకిస్థాన్ దగ్గర అణుబాంబులు ఉన్నాయి. కాబట్టి, ఆ దేశాన్ని మనం గౌరవించాలి. అలా చేయని పక్షంలో భారత్‌పై అణ్వస్త్రం ప్రయోగించాలన్న ఆలోచన ఆ పిచ్చివాళ్లకు (పాక్) వస్తుంది. అదే జరిగితే, మనకే నష్టం. మనదగ్గర కూడా అణ్వాయుధాలు లేవని నేను అనట్లేదు. అయితే, లాహోర్‌పై మనం అణుబాంబు వేస్తే.. దాని తాలూకు రేడియేషన్ మన అమృత్‌సర్‌ను చేరడానికి 8 సెకండ్లు కూడా పట్టదు. కాబట్టి, పాకిస్థాన్‌తో మనం చర్చలు జరుపాలి. అంతేగానీ, సైన్యంతో వారిని కవ్వింపులకు గురిచేసి రెచ్చగొట్టొద్దు. అలా చేస్తే, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతాయి. దీంతో మనమే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది' అంటూ గత నెలలో ఓ ఇంటర్వ్యూలో అయ్యర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ బాలాకోట్ దాడి గురించి ప్రస్తావిస్తూ.. పాక్‌ను పరోక్షంగా హెచ్చరించిన సందర్భంగా అయ్యర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మాకు సంబంధం లేదు: కాంగ్రెస్

అయ్యర్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ వాస్తవ సిద్ధాంతాలు బయటపడుతున్నాయని దుయ్యబట్టింది. అయ్యర్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ కూడా స్పందించింది. ఆ వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా పేర్కొన్నారు. అయ్యర్ వ్యాఖ్యలతో పార్టీ విభేదిస్తున్నట్టు తెలిపారు. ఇదే సమయంలో బీజేపీపై ఎదురుదాడికి దిగారు. భారత్ కంటే చైనాది పెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టి ఇప్పుడు వారితో గొడవకు దిగలేమని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ గతంలో పేర్కొన్న వీడియోను పోస్ట్ చేసిన ఖేరా.. బీజేపీ వైఖరిని ఎండగట్టారు.

రామమందిరాన్ని శుద్ధి చేస్తాం!

మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే అయోధ్యలోని రామమందిరాన్ని శుద్ధిచేస్తామని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే అన్నారు. రామమందిర నిర్మాణంలో ప్రధాని మోదీ ప్రొటోకాల్‌ను పాటించలేదని ధ్వజమెత్తారు. గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ విధానం ఆచారాలకు, సంప్రదాయానికి విరుద్ధంగా జరిగిందని ఆరోపించిన పటోలే.. ప్రాణప్రతిష్ఠ ప్రక్రియను నలుగురు శంకరాచార్యులు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. వారితోనే ఆలయాన్ని శుద్ధి చేయిస్తామన్నారు. గర్భగుడిలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించకుండా, బాల రాముడిని ఉంచారన్న పటోలే.. తాము అధికారంలోకి వస్తే, గుడి ప్రాంగణంలో రామ్ దర్బార్‌ను నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి.

12 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్
- మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత?
- ఈ ఏడాది బస్తర్‌లో పలు ఎన్‌కౌంటర్లలో 103 మంది మావోయిస్టులు హతం

కొత్తగూడెం క్రైం, మే 10: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులు మరోసారి రక్తమోడాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు దండకారణ్యంలో శుక్రవారం భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. మావోయిస్టులు రహస్యంగా సమావేశమవుతున్నారని, ఆ పార్టీ అగ్రనేత ఒకరు హాజరవుతున్నారనే సమాచారంతో బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. నక్సలైట్లు ఐఈడీ పేల్చడంతో ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. గత నెల వ్యవధిలో జరిగిన మూడవ పెద్ద ఎన్‌కౌంటర్ ఇది. గత నెల 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. 30న జరిగిన నారాయణ్‌పూర్-కాంకేర్ జిల్లా సరిహద్దులో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో 10 మంది మరణించారు. తాజా ఘటనతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్‌ఢ్‌లోని బస్తర్ రీజియన్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మరణించిన నక్సలైట్ల సంఖ్య 103కు చేరింది. తాజా ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ప్లీనరీ నిర్వహించేందుకు సమావేశమవుతున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దంతెవాడ, బీజాపూర్, సుక్మా జిల్లాల నుంచి జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ విభాగాల నుంచి 1,200 మంది బలగాలు గంగలూరు పరిధిలోని అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో పీడియా అడవుల్లో తారసపడిన మావోయిస్టులు బలగాలపై కాల్పులకు దిగారు. అప్పటికే ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన కాల్పుల తర్వాత ఘటనాస్థలిలో 12 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు భారీగా ఆయుధ, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. మావోయిస్టుల సమావేశానికి హార్డ్‌కోర్ నక్సల్ కమాండర్లు లింగా, పాపారావుతోపాటు మరికొందరు కీలక నేతలు సైతం హాజరైనట్టు తెలుస్తున్నది. డీకేఎస్‌జెడ్‌సీ, డీవీసీఎం, ఏసీఎం క్యాడర్ మావోయిస్టులు పాల్గొన్నట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఇస్రో '3డీ ప్రింటెడ్' రాకెట్ ఇంజిన్

బెంగళూరు, మే 10: అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో మరో ఘనత సాధించింది. అధునాతన అడిటీవ్ మ్యానుఫ్యాక్చరింగ్(ఏఎం) సాంకేతికతతో పీఎస్4 లిక్విడ్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ఈ నెల 9న విజయవంతంగా పరీక్షించింది. దీనిని 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ అని కూడా అంటారు. సాధారణంగా ఇంజిన్ అంటే అనేక భాగాలను ఒకచోట అమర్చి, వెల్డింగ్ చేసి తయారుచేస్తారు. కానీ, ఈ ఇంజిన్ మొత్తం ఒకే భాగంగా తయారుచేశారు. ఈ సాంకేతికతను వాడటం వల్ల ఇంజిన్ తయారీకి 97 శాతం ముడి పదార్థాలు, 60 శాతం ఉత్పత్తి సమయం ఆదా అయ్యిందని ఇస్రో ప్రకటించింది. ఈ టెక్నాలజీ ద్వారా కేవలం 13.7 కిలోల మెటల్ పౌడర్‌తో రాకెట్ తయారీ పూర్తయ్యిందని వెల్లడించింది. ఈ ఇంజిన్‌ను పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పీఎస్‌ఎల్‌వీ)లో ఎగువ దశలో వినియోగిస్తారు.

జపాన్‌లో ఫ్రెండ్‌షిప్ పెండ్లిళ్లు!

న్యూఢిల్లీ, మే 10: ఫ్రెండ్‌షిప్ పెండ్లి.. జపాన్‌లో నడుస్తున్న కొత్త ట్రెండ్ ఇది. మూడు పదులు దాటిన పెండ్లి కావడం కష్టమవుతున్న జపాన్ యువత.. ఈ కొత్త ట్రెండ్ పట్ల ఆసక్తి చూపుతున్నది. ప్రేమ, శృంగారానికి దూరంగా ఉంటూ దంపతుల్లా కలిసి జీవించడమే ఫ్రెండ్‌షిప్ మ్యారేజ్. చట్టపరంగా వీరు దంపతులైనప్పటికీ ఈ రెండింటికీ దూరంగా ఉంటారు. వీరు కలిసి జీవించవచ్చు. లేదా వేర్వేరుగా ఉండవచ్చు. పిల్లలు కావాలంటే కృత్రిమ గర్భధారణ పద్ధతులు పాటిస్తారు. లేకపోతే పెంచుకుంటారు. పరస్పర అంగీకారం ఉన్నంత కాలం ఇద్దరూ తమకు నచ్చిన వారితో స్వేచ్ఛగా ఉండవచ్చు. 12 కోట్లకు పైగా జనాభా ఉన్న జపాన్‌లో ఇలాంటి వారు 12 లక్షల మంది వరకు ఉన్నారు. వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం అందించే అన్ని ప్రయోజనాలు వీరికి కూడా వర్తిస్తాయి.



సౌదీలో మెర్స్ కరోనా వైరస్.. ఒకరి మృతి

రియాద్, మే 10: తమ దేశంలో కొత్తగా మూడు ప్రాణాంతక మిడిల్-ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్(మెర్స్) కరోనా వైరస్ కేసులు నమోదైనట్టు సౌదీ అరేబియా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఏప్రిల్ 10 నుంచి 17వ తేదీ మధ్యలో ఈ కేసులు నమోదయ్యాయని, వైరస్ బారిన పడ్డ ముగ్గురిలో ఒకరు మరణించారని తెలిపింది. 56 నుంచి 60 ఏండ్ల మధ్య వయస్కులైన రియాద్‌కు చెందిన పురుషులకు వైరస్ సోకిందని తెలిపారు. వీరికి ఒంటెల నుంచి వైరస్ వ్యాపించిందని భావిస్తున్నారు.

పీవోకేలో నిరసన జ్వాలలు

వాహనాన్ని బోల్తా వేసి నిరసన తెలుపుతున్న పీవోకే ప్రజలు

మీర్‌పూర్ : పాకిస్థాన్ విధిస్తున్న పన్నులపై పాక్ ఆక్రమిత కశ్మీరు (పీఓకే)లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మీర్‌పూర్ జిల్లాలోని దద్యాల్ తహశీల్‌లో శుక్రవారం పెద్ద ఎత్తున ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పదుల సంఖ్యలో నిరసనకారులను అరెస్ట్ చేశారు. మొదట్లో ఈ నిరసనలను శనివారం నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా అదనపు బలగాలను మోహరించడంతోపాటు, 70 మంది ఉద్యమకారులను అరెస్ట్ చేయడంతో ప్రజలు శుక్రవారమే వీధుల్లోకి వచ్చి, నిరసన తెలిపారు. నిరసనకారులు భద్రతా దళాలపైకి రాళ్లు రువ్వడంతోపాటు ఘర్షణకు దిగారు. దీంతో అధికారులు పలు ఆంక్షలు విధించారు. జమ్ముకశ్మీరు సంయుక్త అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసనలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని ఈ కమిటీ పాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. వీటిలో కొన్ని సమీపంలోని పాఠశాలలోకి దూసుకెళ్లడంతో కొందరు బాలికలు గాయపడినట్లు తెలుస్తున్నది.



ఎక్స్‌లో పూర్తి నిడివి సినిమాలు పోస్ట్ చేయొచ్చు: మస్క్

న్యూఢిల్లీ, మే 10: ఎక్స్‌లో ఇప్పుడు పూర్తి నిడివి సినిమాలు పోస్ట్ చేయొచ్చని టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ శుక్రవారం వెల్లడించారు. వీటితోపాటు టీవీ సిరీస్‌లు, పాడ్ కాస్ట్‌లను ఎక్స్‌లో పోస్ట్ చేసి మానిటైజేషన్ ద్వారా డబ్బు సంపాదించొచ్చని తెలిపారు. త్వరలోనే ఎక్స్‌లో 'ఏఐ ఆడియెన్సెస్' ఫీచర్‌ను ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. తన సోదరి టోస్కా మస్క్‌కు ఎక్స్‌లో ప్రత్యుత్తరం ఇస్తూ ఆయన ఈ విషయాన్ని చెప్పారు. ఏఐ ఆడియెన్సెస్ ఫీచర్ ద్వారా ప్రకటనదారులు లక్షిత వ్యక్తులకు తమ అడ్వర్టైజ్‌మెంట్ గురించి తెలియజేయవచ్చు.

గుజరాత్‌లో నీట్ పరీక్షలో అక్రమాలు

10 లక్షలిస్తే తానే పరీక్ష రాస్తానని విద్యార్థులతో టీచర్ ఒప్పందం



గోద్రా: గుజరాత్‌లో నీట్ పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం గోద్రాలోని ఒక పాఠశాలలో గత ఆదివారం జాతీయస్థాయి వైద్య విద్య అర్హత పరీక్ష అయిన నీట్-యూజీ ఎగ్జామ్ జరిగింది. ఈ పరీక్షకు ఎగ్జామినర్‌గా వ్యవహరించిన తుషార్ భట్ అనే ఫిజిక్స్ టీచర్ పరీక్ష పాస్ చేయిస్తానని ఆరుగురు విద్యార్థులతో బేరం కుదుర్చుకున్నాడు. ఇందుకోసం జవాబులు తెలియని ప్రశ్నలకు ఖాళీగా వదిలేయాలని.. పరీక్ష అయిపోయాక తాను వాటికి సమాధానాలు రాసి పాసయ్యేలా చూస్తానని విద్యార్థులకు చెప్పాడు. ఇందుకోసం ఒక్కో విద్యార్థి తనకు రూ.10 లక్షలు ముట్టజెప్పాలని డిమాండ్ చేశాడు. అయితే ఈ వ్యవహారం పోలీసులకు తెలియడంతో పోలీసులు గత బుధవారం తుషార్ కారును తనిఖీ చేశారు. ఆరిఫ్ వోరా అనే మధ్యవర్తి తుషార్‌కు ఇచ్చిన రూ.7 లక్షలను కారు నుంచి స్వాధీనం చేసుకొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ తుషార్‌ను విచారణ చేసి అతడి ఫోన్లో నీట్ పరీక్ష రాసిన 16 మంది విద్యార్థుల ఫోన్ నెంబర్లు, వాళ్ల హాల్ టికెట్ల నెంబర్లను గుర్తించారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తుషార్, ఆరిఫ్ వోరాతో పాటు మరో నిందితుడు పరుశురామ్ రాయ్‌పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.